క్లుప్తంగా

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో .. టమాట 130, పచ్చిమిర్చి 90, బెండ 50, కాకర 50, దొండ 30, దోస 30, ఆలు 30, చామ 50, కీర 30, బీర 60, వంకాయ 40, గోకర 50, బీన్స్ 100, బీట్‌రూట్ 50, క్యాప్సికమ్ 80, క్యాబేజీ 30, క్యారెట్ 60, చిక్కుడు 70, ఉల్లి 100 (4 కేజీలు), ములక్కాయలు (2) 10 , క్యాలీఫ్లవర్ (1) 30 సొరకాయ (కేజీ) 30, అల్లం 320, వెల్లుల్లి 220.

కరోనా పరీక్షలు

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. బుధవారం 15 మందికి కరోనా పరీక్షలు నిర్వహించగా అందులో అందరికీ నెగిటివ్ వచ్చిందని నిర్వాహకులు మనోహర్ తెలిపారు. అదేవిధంగా 11 మందికి ఆర్టీపీసీఆర్ టెస్టులు నిర్వహించినట్లు తెలిపారు.

లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి నుంచి రాకపోకలు బంద్



శేరిలింగంపల్లి: వర్షం కారణంగా లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద మళ్లీ రాకపోకలు నిలిచిపోయాయి. బుధవారం కూడా బారికేడ్స్‌తో మూసివేయడంతో భెల్ చౌరస్తా నుంచి గచ్చిబౌలికి, గచ్చిబౌలి నుంచి భెల్ చౌరస్తాకు నల్లగండ్ల రైల్ ఓవర్ బ్రిడ్జి మీదుగా ట్రాఫిక్‌ను మళ్లించారు. దీంతో వాహనదారులు అసౌకర్యానికి గురవుతున్నారు.

రోడ్లు, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని వినతి



కార్పొరేటర్ షేక్ హమీద్ పటేల్‌కు వినతిపత్రం ఇస్తున్న ఉపేందర్ రెడ్డి

గచ్చిబౌలి: ఓల్డ్ ముంబై జాతీయ రహదారిని అనుకొని ఉన్న డైమండ్‌హిల్స్‌లో రోడ్లు, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని కొండాపూర్ కార్పొరేటర్ షేక్ హమీద్ పటేల్‌కు డైమండ్‌హిల్స్ డెవలప్‌మెంట్ సొసైటీ సభ్యులు వినతిపత్రం అందజేశారు. డైమండ్‌హిల్స్ లేఅవుట్‌లోని 60, 40 అడుగుల రోడ్లను యు ఆకారంలో అభివృద్ధి చేయాలని కోరారు. రోడ్లు సరిగ్గా లేకపోవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఆటంకం కల్గుతుందన్నారు. పార్క్ స్థలం కబ్జాకు గురి కాకుండా అభివృద్ధి చేయాలని వారు కోరారు. లేఅవుట్ రెగ్యులరైజేషన్ చేయాలని లేదా షరతులతో నిర్మాణాలకు అనుమతి ఇచ్చే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని తెలిపారు.దీనిపై కార్పొరేటర్ సానుకూలంగా స్పందించారని తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు ఉపేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నరేందర్ రెడ్డి, సంయుక్త కార్యదర్శి నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

చెరువు కట్ట పరిశీలన

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల గ్రామంలోని ఎర్రచెరువు కట్టను బుధవారం స్థానిక నాయకులు పరిశీలించారు. జెడ్పీటీసీ కుమార్‌గౌడ్, సర్పంచ్ నర్సింహ్మారెడ్డి, ఉపసర్పంచ్ మొగులయ్యలతో పాటు స్థానిక వార్డు సభ్యులు పాల్గొన్నారు. ఏడాది క్రితం అధికారులు కట్టకు మరమ్మతులు చేపట్టారు. ప్రస్తుతం చెరువు పూర్తిగానిండటంతో కట్ట పరిస్థితిని పరిశీలించారు. రైతులు దిగాలు చెందాల్సిన అవసరం లేదని కట్ట బాగానే ఉందని కుమార్‌గౌడ్ తెలిపారు.

కళ కళ..

ఆకట్టుకుంటున్న సీసీఆర్టీ

- దేశవ్యాప్తంగా సాంస్కృతిక కళాకారులకు, ప్రభుత్వ ఉపాధ్యాయులకు శిక్షణ
- ఓపెన్‌ఎయిర్ ఆంపీ థియేటర్, 2 హాళ్లు, లైబ్రరీ
- ఏటా విద్యార్థులకు సమ్మర్ క్యాంపు
- సంవత్సరంలో 15 శిక్షణ కార్యక్రమాలు



విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న దృశ్యం (ఫైల్)



మాదాపూర్: భారత ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటైన సీసీఆర్టీ దేశంలోని నాలుగు ప్రాంతీయ కేంద్రాలలో హైదరాబాద్‌లోది ఒకటి. మాదాపూర్‌లోని హైటెక్స్ పక్కనే ఉన్న సీసీఆర్టీ (సెంటర్ ఫర్ కల్చరల్ రిసోర్సెస్ అండ్ ట్రైనింగ్) కేంద్రం నాలుగు ఎకరాలలో విస్తరించి ఉంది. సంగీతం, నృత్యం, సాంస్కృతిక రంగాలను ప్రోత్సహించే బహుళ విభాగాలుగా ఏర్పాటు చేశారు. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయులు, కళాకారులకు శిక్షణ ఇస్తున్నారు. శిక్షణ పూర్తి అయిన తరువాత సర్టిఫికెట్‌లను అందజేస్తారు.

- సీసీఆర్టీ విశాలంగా, పచ్చిక బయళ్లతో అలరారుతోంది.
- సంవత్సరం పొడవునా దాదాపు 30 నుండి 40 సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతున్నాయి.
- సీసీఆర్టీ అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్‌లో సంగీతం, నృత్యం, సంస్కృతిపై 3వేల పుస్తకాలతో కూడిన లైబ్రరీ ఉంది.
- 1400 చదరపు అడుగుల ఆర్ట్‌గ్యాలరీ, సమావేశ మందిరం ఉన్నాయి.
- శిక్షణ శిబిరాల్లో పాల్గొనే ఉపాధ్యాయులు, కళాకారులు బస చేసేందుకు 45 గదులు, డైనింగ్ హాల్, విశాలమైన గ్రీన్ రూమ్‌లు అందుబాటులో ఉన్నాయి.
- కళాకారులు ఓపెన్ ఎయిర్ ఆంపీ థియేటర్‌లో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించుకునేలా.. 900 మంది కెపాసిటీ ఉంది.
- కార్యక్రమాలను నిర్వహించుకోవాలంటే రూ.10వేల రూపాయలు కట్టి థియేటర్‌ని బుక్ చేసుకోవాలి.
- శాస్త్రీయ నృత్యం, సంగీత కచేరీలతో పాటు వార్షిక కార్యక్రమాలను (పండిత్ మోతీరామ్, పండిత్ మణిరామ్ సంగీత్ సమారోహ) లాంటి కార్యక్రమాలను నిర్వహిస్తారు.
- రామాయణ కల్పవృక్షంలాంటి భారీ నృత్య, సంగీత కార్యక్రమాలను నిర్వహిస్తారు.
- దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన కళాకారులు ఇక్కడ శిక్షణను ఇస్తున్నారు.
- కేంద్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం 15 కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు.
- కూచిపూడి, కథక్, భరతనాట్యం, సంగీతం, ఫోక్ పాటలు, ఫోక్ డ్యాన్స్, పెయింటింగ్, హ్యాండీక్రాఫ్ట్స్ తదితరాలపై శిక్షణ ఇస్తున్నారు.
- నాన్ ఏసీ హాలు, 200 మంది కెపాసిటీ, రూ.9వేలు, జీఎస్టీ చెల్లించాలి.
- ఏసీ హాల్, 100 మంది కెపాసిటీ, రూ.10వేల రూపాయలు, జీఎస్టీ చెల్లించాలి. సౌండ్ సిస్టమ్ అందుబాటులో ఉంటుంది.
- వీటితో పాటు విద్యార్థులకు సమ్మర్ క్యాంపులను నిర్వహిస్తారు.
- సీసీఆర్టీలో కేవలం సాంస్కృతిక కార్యక్రమాలు, సమావేశాలు నిర్వహించుకోవడానికి మాత్రమే అనుమతి ఉందని నిర్వాహకులు తెలిపారు.

అన్ని సౌకర్యాలున్నాయి



దేశవ్యాప్తంగా కళాకారులు, ఉపాధ్యాయులు శిక్షణ శిబిరాలకు వస్తుంటారు. వారికి కావాల్సిన అన్నిరకాల సదుపాయాలను సీసీఆర్టీ కల్పిస్తోంది. కళాకారులు అరంగేట్ర కార్యక్రమాలకు ఓపెన్ ఎయిర్ ఆంపీ థియేటర్ అనుకూలంగా ఉంటుంది. సీసీఆర్టీ నగరం నడిబొడ్డులో ఉండడంతో కళాకారులు కార్యక్రమాల నిర్వహణకు ఆసక్తి చూపుతున్నారు.

–సౌందర్య కౌశిక్, ఫీల్డ్ ఆఫీసర్



సీసీఆర్టీ ఓపెన్ ఎయిర్ ఆంపీ థియేటర్



పచ్చదనంతో నిండిన ఆవరణ

డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం

- ఎమ్మెల్యే గాంధీ
- గౌలిదొడ్డి, టెలికామ్‌నగర్‌లో రూ.1.10 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



వీకర్ సెక్షన్ కాలనీలో నాలాను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గాంధీ తదితరులు

గచ్చిబౌలి/రాయదుర్గం: శేరిలింగంపల్లిని అగ్రగామి నియోజకవర్గంగా తీర్చిదిద్దుతున్నామని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ స్పష్టం చేశారు. గచ్చిబౌలి డివిజన్ గౌలిదొడ్డిలో రూ.87.50 లక్షలు, టెలికామ్‌నగర్‌లో రూ.23 లక్షలతో చేపట్టే భూగర్భ డ్రైనేజీ పనులకు కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా, జలమండలి అధికారులతో కలిసి బుధవారం శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ చొరవతో భారీగా నిధుల కేటాయింపుతో శేరిలింగంపల్లిలో గతంలో ఎన్నడూ లేనివిధంగా అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. శేరిలింగంపల్లిలో ప్రస్తుతం భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నామన్నారు.

టెలికామ్‌నగర్ వీకర్ సెక్షన్‌లో పాదయాత్ర

టెలికామ్‌నగర్‌లోని వీకర్ సెక్షన్ కాలనీలో ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా, జలమండలి అధికారులతో కలిసి పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా బస్తీవాసులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్తులో సమస్యలు రాకుండా చేస్తామని హామీ ఇచ్చారు. వర్షాలు కురుస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సమస్య తలెత్తితే సమాచారం ఇస్తే వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. జలమండలి జీఎం రాజశేఖర్, డీజీఎం శరత్‌రెడ్డి, మేనేజర్ సరేందర్‌రెడ్డి, నాయకులు గణేష్‌ముదిరాజ్, రవీందర్‌రెడ్డి, శ్రీనుపటేల్, సత్యనారాయణ, చెన్నంరాజు, నరేష్, జంగయ్య, సురేందర్, రాజుముదిరాజ్ ,అనిల్‌సింగ్, అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.



టెలికామ్‌నగర్‌లో భూగర్భ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ సాయిబాబా తదితరులు

'ఫీజు రీయింబర్స్‌మెంట్'పై హర్షం

రాయదుర్గం: ఉన్నత విద్యాసంస్థల్లో బీసీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ అందించడం ఆలిండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఐఓబీసీఎస్‌ఏ) విజయమని ఏఐఓబీసీఎస్‌ఏ జాతీయ అధ్యక్షుడు కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూలో బుధవారం ఏఐఓబీసీఎస్‌ఏ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత నెలలో బీసీ శాఖ మంత్రి గంగుల కమలాకర్‌కు సమస్యలపై వినతిపత్రాన్ని ఇచ్చామన్నారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా కేంద్ర విశ్వవిద్యాలయాల్లో ఐఐటీలు, ఐఐఎంలు, ఎన్ఐటీల్లో, పలు సంస్థల్లో సీట్లు పొందిన బీసీ విద్యార్థులందరికీ ఫీజు రీయింబర్స్‌మెంట్ ప్రకటించడాన్ని ఏఐఓబీసీఎస్‌ఏ స్వాగతిస్తుందన్నారు. ఈ నిర్ణయం తీసుకున్న సీఎం కేసీఆర్, మంత్రి గంగుల కమలాకర్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్‌చైర్మన్ బి వినోద్‌కుమార్, బీసీ శాఖ కమిషనర్ బుర్రా వెంకటేశం చొరవ తీసుకోవడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఐఓబీసీఎస్‌ఏ జాతీయ కార్యదర్శి సాయికిరణ్, తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రావణ్‌కుమార్, నాయకులు వెంకట్‌దాస్ పాల్గొన్నారు.

సరుకులు, గొడుగుల పంపిణీ



భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ శ్రీనివాస కాలనీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్‌యాదవ్ ఆదేశాల మేరకు ఆర్‌కేవైటీం సభ్యులు బుధవారం గొడుగులు, నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కొంత మంది నిరుపేదలు వర్షాలకు బయటకు వెళ్లలేని స్థితిలో ఉన్నారని వారికి నిత్యావసరాల కొరత వుందని తెలియజేశారని, వెంటనే స్పందించిన ఆర్‌కేవై టీం సభ్యులతో పంపిణీ చేసినట్లు తెలిపారు. స్థానిక నాయకులు నవీన్‌గౌడ్, వేణుగోపాల్ యాదవ్, బాలాజీ, కృష్ణ, బాలయ్య, ప్రసాద్, నాగరాజ్, హరిబాబు, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

నల్లగండ్లలో జేఎన్‌టీయూ టెక్నికల్ బృందం



అపార్టుమెంట్ సామర్థ్య పరీక్ష చేస్తున్న జెఎన్‌టీయూ టెక్నికల్ అధికారులు



సెల్లార్‌లో మట్టి నింపుతున్న దృశ్యం

నల్లగండ్లలో అపార్టుమెంట్ల సామర్థ్య పరీక్షలు

శేరిలింగంపల్లి: నల్లగండ్లలోని వర్టెక్స్ నిర్మాణ సంస్థ సెల్లార్ పక్కనే ఉన్న అపార్టుమెంట్ల సామర్థ్యాన్ని జేఎన్‌టీయూ టెక్నికల్ బృందం బుధవారం పరిశీలించింది. సెల్లార్ పక్కనే ఉన్న ట్రావ్యాస్, ఆపిల్ అపార్టుమెంట్ల ప్రహరీలు దెబ్బతిన్న విషయం తెలిసిందే. ఆయా అపార్టుమెంట్ల ఏరియా, వాటిలో ఎన్ని ఫ్లాట్లు ఉన్నాయి, ఎన్ని అంతస్థులు నమోదు చేసుకోవడంతో పాటు అపార్టుమెంట్ల పిల్లర్లు, బీములను పరిశీలించారు.కాగా నల్లగండ్లలో తవ్విన సెల్లార్ మూలంగా అపార్టుమెంట్ల ప్రహరీలు కూలాయి. దీంతో వర్టెక్స్ నిర్మాణ సంస్థ సెల్లార్‌లో అపార్టుమెంట్‌ల పక్కన పెద్ద ఎత్తున మట్టి నింపుతోంది. సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టింది.

వరద నీరు నిలవకుండా చర్యలు



హఫీజ్‌పేట్ : చందానగర్ డివిజన్ పరిధిలోని వేమన వీకర్ సెక్షన్, విశ్వేశ్వరయ్య కాలనీలలో రహదారులపై వరద నీరు నిల్వ ఉండకుండా జీహెచ్‌ఎంసీ అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానిక కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం డివిజన్ పరిధిలోని వరద ముంపు ప్రాంతాలలో అధికారులతో కలిసి ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న రెండు రోజుల్లో భారీ వర్షాలు కురవనున్న నేపథ్యంలో అవసరం అయితే తప్ప ప్రజలు బయటకు రావద్దని సూచించారు. వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. శానిటేషన్ సిబ్బంది ఎప్పటికప్పుడు చెత్త చెదారాన్ని తొలగించాలన్నారు.

పరామర్శ

హఫీజ్‌పేట్ : చందానగర్ డివిజన్ పరిధిలోని శివాజీ నగర్‌లో తుల్జాభవాని ఆలయ చైర్మన్, ఉద్యమకారుడు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మల్లికార్జునశర్మ తల్లి మడుపతి రాజమ్మ స్వర్గస్థులైన సందర్భంగా బుధవారం ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను పరామర్శించారు. బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు రఘునాథ్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్ యాదవ్, చెన్నం రాజు, కృష్ణ యాదవ్, అక్బర్ ఖాన్, నటరాజ్ గుప్త తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులు త్వరగా ప్రారంభించాలి

హఫీజ్‌పేట్ : చందానగర్ డివిజన్ పరిధిలోని శ్రీదేవి థియేటర్ నుంచి అమీన్‌పూర్ వరకు చేపట్టబోయే రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా కైలాష్‌నగర్ వద్ద చేపట్టనున్న కల్వర్ట్ , మంజీరా పైప్‌లైన్ తరలింపు పనుల గురించి జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులతో ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలోనే పనులు ప్రారంభించాలన్నారు. కార్యక్రమంలో జలమండలి జీఎం రాజశేఖర్, డీజీఎం నాగప్రియ, ఈఈ శ్రీకాంతి, డీఈ దుర్గ ప్రసాద్, ఏఈ సంతోష్‌రెడ్డి, మేనేజర్ సుబ్రహ్మణ్యం , డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రఘునాథ్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్ యాదవ్, అక్బర్ ఖాన్, సందీప్‌రెడ్డి, నరేందర్ బిల్లా తదితరులు పాల్గొన్నారు.

యుద్ధ వీరులకు ఘన నివాళులు

మియాపూర్: మియాపూర్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో కార్గిల్ విజయ్ దివాస్ సందర్భంగా కార్గిల్ యుద్ధంలో అమరులైన యుద్ధ వీరులకు బుధవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి రమేష్ హాజరై అమరులైన యుద్ధవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గంగారం సంగారెడ్డి, నర్సింగ్‌రావు, సాయన్న, శేఖర్‌గౌడ్, బాలరాజ్ ముదిరాజ్, సలీమ్, సత్యారెడ్డి, రవీందర్‌రావు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన

జిన్నారం(పటాన్‌చెరు): ఆయిల్‌పామ్, పండ్ల తోటల పెంపకంపై ఉద్యానవన, వ్యవసాయశాఖ అధికారులు బుధవారం రైతులకు అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా పండ్ల తోటలు, ఆయిల్‌పామ్ తోటల పెంపకానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ తదితర విషయాలపై రైతులకు ఉద్యానవన శాఖ అధికారి శైలజ అవగాహన కల్పించారు. ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారి శ్రీనివాస్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

మంజీరా రోడ్డు గుంతలమయం



అధ్వానంగా మంజీరా రోడ్డు



బురదమయంగా అంబేడ్కర్ కళ్యాణ మండపం ప్రాంతం

హఫీజ్‌పేట్ : చందానగర్, హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని మంజీరా రోడ్డు వర్షాలకు గుంతలు పడ్డాయి. లింగంపల్లి బీఆర్ గ్యాస్ ఏజెన్సీ నుంచి చందానగర్, గంగారం, హుడాకాలనీ, ఆర్టీసీ కాలనీ వరకు ఉన్న మంజీరా రోడ్డు చిత్తడిగా మారింది. కాగా వర్షాలకు రోడ్లు జలమయమయ్యాయి. రోడ్డుపై ఎక్కడ గుంత ఉందో అర్థంకాని పరిస్థితి నెలకొంది. దీంతో ద్విచక్ర వాహనదారులు భయపడుతున్నారు. ఇక పాదచారులు ఎక్కడ నీరు మీద పడుతుందో అని ఆందోళన చెందుతున్నారు. ఓవైపు పైప్‌లైన్ లీకేజీలు.. మరోవైపు గుంతలతో ఇబ్బందులుపడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. చందానగర్ సర్కిల్– 21 పక్కనే ఉన్న అంబేడ్కర్ కళ్యాణ మండపం ఆవరణ పూర్తిగా బురదమయంగా మారింది .చందానగర్‌లోని ముంబాయి జాతీయ రహదారి ఫ్లైఓవర్ నిర్మాణం జరుగుతున్న సందర్భంగా మంజీరారోడ్డుపై భారీగా పెరిగిన ట్రాఫిక్‌తో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

- మంజీరా రోడ్డుకు సత్వరం తాత్కాలిక మరమ్మతులు చేయాలి
- లింగంపల్లి బీఆర్ గ్యాస్ కంపెనీ నుంచి చందానగర్ క్రిస్టల్ గార్డెన్ వరకు వేసిన సీసీ రోడ్డును ఆర్టీసీ కాలనీ వరకు పొడిగించాలి
- మంజీరా రోడ్డుపై అక్రమంగా దుకాణాల ముందు పార్క్ చేస్తున్న వాహనాలపై ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకోవాలి
- మంజీరా రోడ్డులో మంచినీటి పైప్‌లైన్ లీకేజీలకు తక్షణమే మరమ్మతులు చేయాలి.
- మంజీరా రోడ్డు విస్తరణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

రోడ్డుపైకి రాలేకపోతున్నాం



చందానగర్ మంజీరా రోడ్డుపై ఏర్పడిన గుంతలతో రోడ్డుపైకి రావాలంటేనే భయపడుతున్నాం. చిన్నపాటి వర్షం పడితే చాలు రోడ్డంతా గుంతలవుతున్నాయి. వాహనంపై బయటకు రావాలంటే జంకుతున్నా. ఇప్పటికైన అధికారులు ఎమర్జెన్సీ టీంలతో రోడ్డు మరమ్మతులు చేయించాలి.

– గంగుల తిమ్మారెడ్డి, చందానగర్

మంజీరా రోడ్డును విస్తరించాలి



లింగంపల్లి నుంచి ఆర్టీసీ కాలనీ వరకు ఉన్న మంజీరా రోడ్డును 100 ఫీట్లకు విస్తరించాలి. జాతీయ రహదారిపై ఫ్లైఓవర్ నిర్మాణం వల్ల మంజీరా రోడ్డుపై భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ఈ రోడ్డు విస్తరణ చేపట్టాలి.

–నరాల మహేశ్వర్‌రెడ్డి, చందానగర్

సైనికుల సేవలు మరువలేనివి

పటాన్‌చెరు టౌన్: దేశాన్ని కాపాడే సైనికులను గుర్తించుకోవాల్సిన అవసరం ఉందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నీలం మధు ముదిరాజ్ తెలిపారు.బుధవారం కార్గిల్ విజయ్ దివాస్ సందర్భంగా సైనికులను స్మరించుకుంటూ వడ్డే ఓబన్న యువజన సంఘం ఆధ్వర్యంలో ఎన్ఎంఆర్ యువసేన సభ్యులు అమీన్‌పూర్‌లోని మహిమ మినిస్ట్రీస్ అనాధ ఆశ్రమంలో అన్నదానం నిర్వహించారు.ప్రతికూల పరిస్థితులను సైతం ఎదుర్కొని దేశ సరిహద్దుల్లో నిరంతరం కాపలాకాసే సైనికులకు ధైర్యాన్ని అందించవలసిన అవసరం మనపై ఉందన్నారు.

రెయిన్‌కోట్‌లు అందజేత

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండలం బొల్లారం మున్సిపల్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య సిబ్బందికి బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ రోజారాణి రెయిన్ కోట్‌లను అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పారిశుధ్య సిబ్బంది సేవలు మరువలేనివన్నారు. వర్షాకాలం ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కమిషనర్ సంగారెడ్డి, ఆర్ఓ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

మెట్రో బాత్‌రూమ్‌లను వేరే చోట ఏర్పాటు చేయాలి



మెట్రోస్టేషన్ బాత్‌రూమ్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్, అధికారులు

మూసాపేట: భరత్‌నగర్ న్యూ హెచ్ఐజీ వద్ద వరదనీటి లా నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న మెట్రోస్టేషన్ బాత్‌రూమ్‌లను వెంటనే తొలగించి వేరే ప్రాంతంలో ఏర్పాటు చేయాలని హెచ్ఎంఆర్ అధికారులను కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ కోరారు. ఈ సందర్భంగా బుధవారం మెట్రో రైల్ అధికారులు, డీఈ రామకృష్ణ, ఏఈ రంజిత్‌తో కలిసి భరత్‌నగర్ మెట్రోస్టేషన్ వద్ద ఆయన పర్యటించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఐజీ జనరల్ సెక్రటరీకృష్ణయ్య, కాలనీవాసులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతాం



కూకట్‌పల్లి: ఇటీవల కురిసిన వర్షాలకి వసంతనగర్‌లోని రోడ్‌నం.4, 5 వద్ద డ్రైనేజీ పొంగిపొర్లుతోంది. బుధవారం ఆ ప్రాంతాన్ని కేపీహెచ్‌బీ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు అధికారులతో కలిసి పరిశీలించారు. డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు ఏఈ సాయిప్రసాద్, హెచ్ఎండబ్ల్యూఎస్ మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి, వెంకటేష్, వసంత నగర్ అధ్యక్షుడు నాగేశ్వరరావు, రాము, వెంకటేశ్వరరావు, మురళీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.